మురుగు సమస్యపై.. ముట్టడి

- రామ్‌లీలా ప్రధాన రోడ్డులో తిష్టవేసిన మురుగు
- ఈ దారిగుండా వెళ్లాలంటే నరకయాతన
- ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోని అధికారులు
- సమస్యను పరిష్కరించాలని చౌరస్తాను ముట్టడించిన విద్యార్థులు



రామ్‌లీలా ప్రధాన రోడ్డులో పారుతున్న మురుగు నీటిని చూపిస్తున్న స్థానికులు

సుభాష్‌నగర్: గ్రేటర్ హైదరాబాద్‌లోనే అత్యధిక జనాభా కలిగిన ఆ ప్రాంతం ప్రధాన రోడ్డులో మురికినీరు నిత్యం ఏరులై పారడంతో స్థానికులను కొన్ని సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి వందల సార్లు తీసుకెళ్లినా పరిష్కరించిన పాపానపోలేదు. దీంతో స్థానికులు, విద్యార్థులు మురుగు సమస్యను పరిష్కరించాలంటూ రోడ్డెక్కి అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రామ్‌లీలా మైదానం చౌరస్తాను ముట్టడి చేశారు.

◆ సుభాష్‌నగర్ డివిజన్ సూరారం రామ్‌లీలా మైదానం చౌరస్తా నుంచి రెండో ఓం జెండా వరకు కొన్ని సంవత్సరాలుగా నిత్యం మురుగునీరు రోడ్డుపై 24 గంటల పాటు ప్రవహిస్తోంది. నిత్యం రద్దీగా ఉండే ఆ రోడ్డులో రాకపోకలు సాగించాలంటే మురికినీటితో జనాలు పడరానిపాట్లు పడుతున్నారు. ఈ విషయమై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతో గురువారం



సూరారం రామ్‌లీలా మైదానం చౌరస్తా వద్ద నిరసనలో విద్యార్థులు, స్థానికులు

ఉదయం 9 గంటలకు స్థానికంగా ఉన్న సిరి ఫ్యూచర్ కిడ్స్ స్కూల్, కృషి హైస్కూల్ విద్యార్థులు రామ్‌లీలా మైదానం చౌరస్తాను ముట్టడి చేసి నిరసన తెలిపారు. విద్యార్థులకు మద్దతుగా వ్యాపార దుకాణాల యజమానులు, స్థానికులు నిరసనలో పాల్గొని అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి అక్కడికి చేరుకుని వారి సమస్యను తెలుసుకున్నారు. ఈ విషయమై అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

> అది గ్రేటర్‌లోనే అత్యధిక జనాభా కలిగిన ప్రాంతం. నిత్యం ఆ దారిగుండా వేలాదిమంది రాకపోకలు సాగిస్తుంటారు. ఆ దారిలో కొన్నేళ్లు మురుగు సమస్య వేధిస్తోంది. దీంతో ఈ ప్రధాన రహదారి గుండా ప్రయాణాలు సాగిచాలంటే ముక్కుమూసుకోవాల్సిన పరిస్థితి. సమస్యను పరిష్కరించాలని అధికారులను ఎన్నిసార్లు వేడుకున్నా ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో అధికారుల కళ్లు తెరిపించటానికి స్కూల్ విద్యార్థులు ముందుకు వచ్చి రహదారిని ముట్టడి చేశారంటే సమస్య ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అయితే విద్యార్థుల ముట్టడికి స్థానికులు, వ్యాపార వర్గాలు కూడా మద్దతుగా నిలిచాయి.

ఎందుకు ఈ సమస్య..

సూరారం రెండో ఓం జెండా ఎగువ ప్రాంతం నుంచి దిగువ ప్రాంతమైన మొదటి ఓం జెండా వరకు డ్రైనేజీ పైపులైన్ ఉంది. గత కొన్ని సంవత్సరాల క్రితం వేసిన పైపులైన్ సామర్థ్యం చిన్నదిగా ఉండడం గత పది సంవత్సరాల వ్యవధిలో జనాభా 5 ఇంతలు పెరగడంతో పైపులైన్ సామర్థ్యం సరిపోకపోవడంతో నిత్యం మురుగునీరు రోడ్డుపై నుంచి ప్రవహిస్తోంది. దీంతో స్థానికులు, వాహనదారులు, విద్యార్థులు, షాపు యజమానులు, పడరానిపాట్లు పడుతున్నారు.

పదుల సంఖ్యలో..

రామ్‌లీలా మైదానం చౌరస్తా సమీపంలో పోలీస్ ఔట్‌పోస్ట్, జడ్పీహెచ్ఎస్ స్కూల్, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ, మీసేవ, ఎన్టీఆర్ భవన్, లూయిస్ బ్రెయిల్ భవన్, ప్రైవేట్ పాఠశాల, కూలీ అడ్డ, రేషన్‌షాపు, ప్రార్థన మందిరాలు, ఆర్టీసీ బస్టాండ్, కూరగాయలు, చేపల మార్కెట్‌తోపాటు తెలుగుతల్లినగర్, రాజీవ్ గృహకల్ప సముదాయం, బహదూర్‌పల్లి వెళ్లే రోడ్డు ఇదే ఉండడంతో నిత్యం ఈ రోడ్డు, చౌరస్తా జనాలతో కిక్కిరిసిపోయి ఉంటుంది. ఇక ఉదయం, సాయంత్రం వేళలో మరింత రద్దీగా ఉంటుంది. మురుగునీరు రోడ్డుపై పారుతుండటంతో అటుగా వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అన్ని పార్టీలు ఏకమవ్వాలి



రామ్‌లీలా మైదానం చౌరస్తాలో ఎదుర్కొంటున్న మురుగు సమస్యపై అన్ని పార్టీలు ఏకమవ్వాలి. ఈ సమస్యపై ఇప్పటికి రూ. 46 లక్షలతో అంచనా వేసి పనులు జరిపించాలని అధికారులు దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ప్రయోజనం లేదు. ఇక ఉన్నతాధికారుల వద్దకు వెళ్లి అక్కడే తేల్చుకుంటాం.

– సురేష్ రెడ్డి, మాజీ కార్పొరేటర్

అధికార యంత్రాంగం ఏం చేస్తుంది ?



గ్రేటర్‌లోని అత్యధిక జనాభా కలిగిన సుభాష్‌నగర్ డివిజన్ సూరారం రామ్‌లీలా మైదానం చౌరస్తా గత కొన్ని సంవత్సరాలుగా మురుగునీటి సమస్యతో సతమతమవుతున్నా అధికార యంత్రాంగం ఏం చేస్తుంది. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన అధికారులు మొద్దు నిద్ర విడడం లేదు. ఈ రోడ్డుపై పారుతున్న మురుగునీటితో కూరగాయల షాపులు పెట్టడం లేదు. చాలామంది వేరే రోడ్డును ఎంచుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోవాలి.

– కొట్టే రవి

నేడు కార్తీక పౌర్ణమి పూజలు



ఆలయంలో కొలువైన చిత్తారమ్మ

సుభాష్‌నగర్: కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని గాజులరామారం చిత్తారమ్మ దేవి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్యగౌడ్ తెలిపారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఈ కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు.

హైమాస్ట్.. వెలగదేం?



కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ శ్రీదుర్గా ఎస్టేట్స్‌లోని సుచిత్ర కమ్యూనిటీ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు కొన్ని రోజులుగా వెలగడం లేదు. ప్రధాన రహదారి కావడంతో ఈ మార్గం నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. రాత్రి ఈ ప్రాంతంలో చీకట్లు అలుముకోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి హైమాస్ట్ లైట్లకు మరమ్మతులు చేపట్టి వెలుగులు నింపాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం



జీడిమెట్ల: డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ ఆంజనేయులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జీడిమెట్ల డిపో నుంచి నడిచే బస్ సర్వీసులకు సంబంధించి ప్రయాణికుల నుంచి సలహాలు, ఫిర్యాదులు స్వీకరిస్తామని, డయల్ యువర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు సలహాలు, సూచనలకు **9959226150** నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ప్రజా సేవ చేయడమే లక్ష్యం



వినతులు స్వీకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: ప్రజలకు సేవ చేయడమే తమ లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. షాపూర్‌నగర్‌లోని తన నివాసంలో పలువురు నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు కలిసి వివిధ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి, కాలనీల అభివృద్ధికి సత్వర చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

కులగణనకు కార్మికులు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చింతల నాగరాజు

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేకు కార్మికులు సహకరించాలని ఐఎన్‌టీయూసీ నాయకుడు చింతల నాగరాజు అన్నారు. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని తన కార్యాలయంలో యూనియన్ అధ్యక్షుడిగా ప్రాతినిధ్యం వహిస్తున్న పలు కంపెనీల జనరల్ సెక్రటరీలతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులందరూ పూర్తి వివరాలు తెలియజేసి 6 గ్యారంటీలను పొందాలని సూచించారు. సర్వే సమయంలో కంపెనీ యాజమాన్యాలు కార్మికులకు అనుమతి ఇచ్చి సర్వేలో పాల్గొనేలా సహకరించాలని కోరారు. కులగణన సర్వే చేయడం వల్ల రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు, వివిధ కులాలు రిజర్వేషన్లు పొందవచ్చన్నారు.

రోడ్డుపై చెత్త తొలగించరా?



నందానగర్‌లోని ప్రణవ్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను ఆనుకుని రోడ్డుపై ఉన్న వ్యర్థాలు

రంగారెడ్డినగర్: జీహెచ్ఎంసీ పరిధిలో చెత్త వ్యర్థాల డంపింగ్ పాయింట్లను తొలగించే ప్రక్రియ నీరుగారుతోంది. ఓ పక్క అధికారులు చెత్త డంపింగ్ పాయింట్లను తొలగించి హెచ్చరికలు బోర్డులు ఏర్పాటు చేస్తున్నా, మరో పక్క కొత్త ప్రాంతాల్లో డంపింగ్ పాయింట్లు వెలుస్తున్నాయి. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి నందానగర్‌లోని ప్రణవ్ ఇంటర్నేషనల్ స్కూల్ గోడను ఆనుకుని రోడ్డుపై కొన్ని రోజులుగా చెత్తను వేస్తున్నారు. స్థానికులతో పాటు అటుగా వెళ్లే వాహనదారులు చెత్తను వేస్తున్నారు. దుర్గంధంతో కంపు భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు చెత్తను వేయకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

విద్యా సంస్థల్లో బాలల దినోత్సవం

జాతీయ బాలల దినోత్సవాన్ని గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల్లో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. కొన్ని పాఠశాలల్లో ఫుడ్ ఫెస్టివల్, వ్యాసరచన పోటీలు, వివిధ క్రీడలు నిర్వహించి విద్యార్థులకు సర్టిఫికెట్లు, ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. భారతదేశ మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

– కుత్బుల్లాపూర్

వివిధ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్, క్రీడలు, వ్యాసరచన పోటీలు



సూరారం నార్త్‌సిటీ హైస్కూల్‌లో..



చింతల్ టీవీఆర్ స్కూల్ ఫుడ్‌ఫెస్ట్‌లో విద్యార్థులు



బౌరంపట్ జడ్పీహెచ్ఎస్‌లో..



ఆదర్శనగర్‌లో నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జయరామ్, శంకరయ్య



చింతల్ అక్షర ఇంటర్నేషనల్ స్కూల్‌లో..



అపురూప కాలనీ టీవీఆర్ హైస్కూల్ వేడుకల్లో పాల్గొన్న జీడిమెట్ల సీఐ మల్లేష్



నెహ్రూనగర్ జడ్పీహెచ్ఎస్‌లో .. డీఈవో విజయకుమారి, ఎంఈవో జెమినికుమారి



వేంకటేశ్వరనగర్ సత్‌జ్ఞాన్ స్కూల్ వేడుకల్లో పాల్గొన్న కుత్బుల్లాపూర్ డీసీ నరసింహ

అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మేయర్ నీలారెడ్డి, కమిషనర్ సాబేర్ అలీ

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్‌ను అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దనున్నామని మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. గురువారం నిజాంపేట్ 21వ డివిజన్ పరిధిలోని సాయినగర్‌లో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన భూగర్భ డ్రైనేజీ లైన్ పనులు, రూ.99 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను కమిషనర్ సాబేర్ అలీతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సాయినగర్ కల్వర్ట్ నుంచి దుర్గమ్మ ఆలయం వరకు నిర్మించిన డ్రైనేజీ లైన్‌తో స్థానికంగా నెలకొన్న మురుగునీటి సమస్య తొలగనుందన్నారు. కార్పొరేషన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ సత్యనారాయణ, ఏఈ ప్రవీణ్ కుమార్, డీఈలు నళిని, దాసయ్య, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ సుకృత, కాంగ్రెస్ నాయకుడు సాంబశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కష్టపడే కార్యకర్తలకు తగిన గుర్తింపు



నియామకపత్రం అందుకుంటున్న ఎంబరి ఆంజనేయులు

దుండిగల్: సభ్యత్వ నమోదులో కీలకంగా వ్యవహరించిన నేతలకు పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి ఎస్.మల్లారెడ్డి అన్నారు. గండిమైసమ్మలోని పార్టీ కార్యాలయంలో మున్సిపాలిటీ అధ్యక్షుడు ఆనబోయిన మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు వంద మందికి పైగా సభ్యత్వం చేయించిన నాయకులకు క్రియాశీల సభ్యత్వాన్ని అందజేశారు. అనంతరం ఓబీసీ మోర్చా మున్సిపల్ అధ్యక్షుడిగా ఎంబరి ఆంజనేయులు, యువ మోర్చా అధ్యక్షుడిగా ఆకుల యశ్వంత్ పటేల్‌ను నియమించారు. వారికి నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో శ్యామ్ రావు, మల్లారెడ్డి, కృష్ణారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, వెంకటేష్ నాయక్, ఆకుల విజయ్, సాయి, నర్సింహచారి, ప్రకాష్, సీతారాం రెడ్డి పాల్గొన్నారు.

గ్రామకంఠం స్థలాలకు సర్టిఫికెట్ ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దుండిగల్: గ్రామకంఠం కలిగిన స్థలాలకు సర్టిఫికెట్లను అందజేయాలని బీజేపీ నాయకులు కోరారు. గురువారం రెవెన్యూ కార్యాలయంలో గండిమైసమ్మ-దుండిగల్ మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బౌరంపేట్, మల్లంపేట, దుండిగల్, గాగిల్లాపూర్, బహదూర్‌పల్లి, డి పోచంపల్లి, శంభీపూర్, నాగులూరు గ్రామాల్లో గ్రామ కంఠం భూముల్లో ప్రజలు తాతలనాటి కాలం నుంచి నివసిస్తున్నారన్నారు. ఇంటి నిర్మాణం చేసుకోవాలన్నా, లోన్ తీసుకోవాలన్నా, అమ్మకం, కొనుగోలు చేయాలన్నా, తల్లిదండ్రులను కోల్పోయిన వారి వారసుల పేరు మార్చుకోవాలన్నా గ్రామ కంఠం సర్టిఫికెట్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ ప్రాంతాల్లో రెవెన్యూ మేళా నిర్వహించి ఇల్లు, ఇంటి స్థలం సర్వే చేసి వెంటనే గ్రామ కంఠం సర్టిఫికెట్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ మల్లారెడ్డి, జిల్లా కోశాధికారి పీసరి కృష్ణారెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు ఏ మల్లేష్, నాయకులు నరసింహచారి, డి ప్రభాకర్‌రెడ్డి, సీతారాం రెడ్డి, ఆంజనేయులు, ఆకుల విజయ్, భానుగౌడ్, యశ్వంత్ పటేల్, రోజా, వెంకటేష్ నాయక్ పాల్గొన్నారు.

గ్రూపు-3 పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్-3 రాత పరీక్షలకు విధులు నిర్వహిస్తున్న సంబంధిత అధికారులు అందరూ సమన్వయంతో పని చేసి, పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్లో ఏర్పాటు చేసిన టీజీపీఎస్సీ గ్రూప్-3 రాత పరీక్ష పై సమీక్షా సమావేశానికి డీఆర్ఓ హరిప్రియతో కలిసి అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెకర్ మాట్లాడుతూ.. చీఫ్ సూపరింటెండెంట్లు, ఫ్లయింగ్ స్క్వాడ్, రూట్ ఆఫీసర్లు, డిపార్టుమెంట్ ఆఫీసర్లు, డిస్ట్రిక్ట్ ఆఫీసర్లు వారి వారికి కేటాయించిన విధులను సమయపాలన పాటిస్తూ, ఏలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తగా నిర్వహించాలని అన్నారు. ప్రతి ఒక అంశము నియమ నిబంధనల ప్రకారం చేయాలని, మీకు కేటాయించినంత వరకు మాత్రమే మీరు మీ విధులను నిర్వహించాలని అదనపు కలెక్టర్ సూచించారు. చీఫ్ సూపరింటెండెంట్లు పరీక్షా కేంద్రాలను పరిశీలించి అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అందరితో సమన్వయం చేసుకుంటూ గ్రుప్-3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. భద్రత పోలీసుశాఖ వారితో, నిరంతరాయ విద్యుత్తు, త్రాగునీరు, అదనపు బస్సులు సంబంధిత శాఖల అధికారులతో కోఆర్డినేట్ చేసుకొని అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు ఒకరోజు ముందుగానే తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలను పరిశీలించుకోవాలన్నారు. పరీక్షా సెంటర్లలో రూట్ మ్యాప్‌లు, సైన్ బోర్డ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్ వంటి వాటిని సరిగ్గా ఉన్నాయా లేదా అని పరిశీలించాలని సూచించారు. ఈ పరీక్షలకు విధులు నిర్వహిస్తున్న అధికారులందరీ సెల్ ఫోన్లను పరీక్షా కేంద్రాలలోనికి అనుమతించడం జరగదని స్పష్టం చేశారు. సంబంధిత అధికారులు వారి నిర్ణీత సమయంలోగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు.

వాసవీ ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం





సాక్షి, సిటీబ్యూరో/నిజాంపేట్ : ఆదర్శ్ వుమెన్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో కలిసి బాచుపల్లిలోని వాసవీ ఆసుపత్రిలో ఉచిత హెల్త్ క్యాంపును నిర్వహించారు. గురువారం ప్రారంభమైన క్యాంపు ఈ నెల 17 వరకు కొనసాగనుంది. ఉదయం 9 నుంచి 2 గంటల వరకు ఈ క్యాంపు నిర్వహించనున్నారు. పాప్స్‌మియర్, బీఆర్‌బీఎస్, సీబీపీ, ఈసీజీ వంటి టెస్టులను ఉచితంగా నిర్వహించనున్నట్లు డాక్టర్ లావణ్య తెలిపారు. తొలి రోజు 50 మందికి టెస్టులు చేశామని ఆసుపత్రి ఎండీ శిరీష్, డాక్టర్ అరుణ వెల్లడించారు. ప్రతి నెల ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

రోడ్డు దాటుతుండగా లారీ ఢీ

తీవ్ర గాయాలు.. ఆసుపత్రికి తరలింపు

దుండిగల్: రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుర్తు తెలియని లారీ ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శంకర్ వివరాల ప్రకారం.. గండిమైసమ్మ చౌరస్తాలో గురువారం రాత్రి 7 గంటల సమయంలో ఓ వ్యక్తి రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో మియాపూర్ నుంచి దుండిగల్ వైపు వస్తున్న ఓ లారీ అతడిని ఢీ కొట్టింది. అతను తీవ్రంగా గాయపడటంతో 108 ద్వారా సూరారంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం పోలీసులు అక్కడి నుంచి గాంధీ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి పేరు రాజు(45)గా పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. కాగా ఇప్పటి వరకు పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.